సాక్షి పశ్చిమగోదావరి

మంగళవారం । 10 । డిసెంబర్ । 2024



శ్రీవారి వాకిలి.. బంగారు లోగిలి

ద్వారకాతిరుమల శ్రీవారి అంతరాలయం స్వర్ణ శోభితమైంది. స్వర్ణ కాంతులతో ధగధగలాడుతూ మంత్ర ముగ్ధులను చేస్తోంది.

8లో



మింగేస్తున్న స్మార్ట్‌ఫోన్లు

చిన్నారులు సెల్‌ఫోన్లకు అతుక్కుపోవడం, ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసలవడం ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

8లో



భూమి కబ్జాకు యత్నం

తాడేపల్లిగూడెం తాలుకా ఆఫీసు ప్రాంగణంలోని రెవెన్యూ స్థలం ఆక్రమణకు కొందరు ప్రయత్నించగా అధికారులు అడ్డుకున్నారు.

8లో

న్యూస్‌రీల్

ఫిర్యాదులపై చర్యలకు ఆదేశం



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం : స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, తల్లిదండ్రుల వేధింపులు, అత్తింటి వేధింపులు, భూ ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన మోసం, ప్రేమ పేరుతో మోసం వంటి వాటిపై పలువురు ఫిర్యాదులు చేశారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మి బాధితులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఫిర్యాదులపై సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆ దేశించారు. జిల్లా అదనపు ఎస్పీ వి.భీమారావు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు పాల్గొన్నారు.

ప్రాతాళ్లమెరకలో పింఛన్ల తనిఖీ



వృద్ధురాలితో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ వేణుగోపాల్

కాళ్ల: ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన పింఛన్ల తనిఖీల్లో పైలెట్ ప్రాజెక్టులో భాగంగా మండలంలోని ప్రాతాళ్లమెరకలో సోమవారం పింఛన్ల తనిఖీ నిర్వహించారు. ఆకివీడు, ఉండి మండలాలకు చెందిన 12 మంది మండల స్థాయి అధికారుల బృందాలు సచివాలయం పరిధిలోని ప్రాతాళ్లమెరక, పల్లిపాలెం గ్రామాల్లో 416 మంది పింఛన్ లబ్ధిదారులు వివరాలు తనిఖీ చేశారు. డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్‌ఎస్ వేణుగోపాల్ పర్యవేక్షించారు. లబ్ధిదారుల వాస్తవ అర్హతలు నిర్ధారించడానికి ప్రాతాళ్లమెరకలో పింఛన్ల తనిఖీ చేపట్టామని ఆయన అన్నారు. లబ్ధిదారుల నుంచి వివరాలు సేకరించి ప్రభుత్వం సూచించిన యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నామన్నారు. సర్పంచ్ కంతేటి ఉషా శ్రీనివాసరాజు, పంచాయతీ కార్యదర్శి బి.ఏసురాజు, ఎంపీడీఓలు డి.సుహాసిని, ఎస్.రవీంద్ర, తహసీల్దార్ ఎన్.వెంకటేశ్వరరావు, సీడీపీఓ వీవీ విజయరత్నం, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాన్ని అడ్డుకోవాలి



వినతిపత్రం అందిస్తున్న దళిత సంఘాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఎదురుగా ఉన్న ప్రభుత్వ భూమిలో దౌర్జన్యంగా మెటీరియల్‌ను దింపిన జనసేన నాయకుడు, బిల్డర్‌పై చర్యలు తీసుకోవాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఆదివారం రాత్రి ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాలు నిర్మించడం శోచనీయమన్నారు. అక్రమ నిర్మాణాలను అధికారులు నిలుపుదల చేయడం, అక్కడ ఉన్న మెటీరియల్‌ను సీజ్ చేస్తామని చెప్పారని, అయితే సీజ్ చేస్తానన్న వాహనాలు ఆ స్థలంలో లేవన్నారు. అన్న క్యాంటీన్ పక్కన 40 ఏళ్ల క్రితం ఎస్సీ కార్పొరేషన్ కాంప్లెక్స్ కట్టడానికి శిలాఫలకం వేశారని, ఆ శిలాఫలకం కూడా ఇప్పుడు లేదన్నారు. రాపాక వెంకటేశ్వరరావు, ఆండ్రు లక్ష్మణరావు, విప్పర్తి ఆనందరావు తదితరులు ఉన్నారు.

రూ.2.30 కోట్ల నిధుల దుర్వినియోగం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం మండలం రాయలం పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై ప్రత్యేక బృందాన్ని నియమించగా రూ.2,30,43,635 దుర్వినియోగమైనట్టు తేలింది. ముత్యాలపల్లి పంచాయతీ సెక్రటరీ ఎస్‌కేజీ కృష్ణంరాజు రూ.1,99,50,956లు, యలమంచిలి మండలం చించినాడ పంచాయతీ సెక్రటరీ డి.జయరాజు రూ.14,94,224లు, చినఅమిరం పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ సుమనాగ్ రూ.15,98,455లు దుర్వినియోగం చేసినట్టు డీపీఓ అరుణశ్రీ కలెక్టర్‌కు సోమవారం నివేదిక అందించారు. వీరు ముగ్గురూ గతంలో రాయలం పంచాయతీలో పనిచేశారు. వీరిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని భీమవరం తహసీల్దార్‌ను ఆదేశిస్తూ కలెక్టర్ నాగరాణి ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే నిధుల దుర్వినియోగంలో పరోక్షంగా సహకరించిన వారిపై కూడా చర్యలకు ఆదేశిస్తూ జిల్లా ఆడిట్ అధికారికి కలెక్టర్ సూచించారు.

పశ్చిమకే టీచర్ ఎమ్మెల్సీ

- యూటీఎఫ్ నేత గోపీమూర్తి విజయం
- మొదటి ప్రాధాన్యంలోనే 3,906 ఓట్ల మెజార్టీ
- మూడు పర్యాయాలుగా ఉమ్మడి పశ్చిమకే ఎమ్మెల్సీ అవకాశం



టీచర్ ఎమ్మెల్సీగా ఎన్నికైన గోపీమూర్తికి ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ షాన్‌మోహన్

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఉభయగోదావరి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ పోరులో పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన బొర్రా గోపీమూర్తి గెలుపొందారు. మొదటి ప్రాధాన్యత ఓటుతోనే ఆయన విజయం సాధించారు. వరుసగా మూడుసార్లు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన నేతలే టీచర్ ఎమ్మెల్సీగా గెలుస్తూ ఉన్నారు. 2021లో గెలుపొందిన ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మృతితో ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో ఈనెల 5న ఎన్నికలు నిర్వహించి సోమవారం కాకినాడలో కౌంటింగ్ ప్రక్రియ పూర్తి చేశారు.

గోపీమూర్తికి 9,165 ఓట్లు

మొత్తం 15,494 ఓట్లు పోలవగా, 814 ఓట్లు చెల్లుబాటు కానివిగా గుర్తించారు. మిగిలిన 14,680 మొదటి ప్రాధాన్యత ఓట్లు లెక్కించగా గోపీమూర్తికి 9,165 ఓట్లు, సమీప ప్రత్యర్థి, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన గంధం నారాయణరావుకు 5,259 ఓట్లు, పి.దీపక్‌కు 102, కె.నాగేశ్వరరావుకు 72, నామాన వెంకట లక్ష్మికి 81 ఓట్లు పోలయ్యాయి. మొదటి ప్రాధాన్యంలోనే 3,906 ఓట్ల మెజార్టీ దక్కడంతో రెండో ప్రాధాన్యత ఓటు లెక్కించాల్సిన అవసరం లేకపోయింది.

పీడీఎఫ్‌కు హ్యాట్రిక్ విజయం

రాష్ట్రంలో 2006లో శాసనమండలిని పునరుద్ధరించగా.. 2006 నుంచి 2008 వరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఆదిత్య విద్యాసంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి ఎన్నికయ్యారు. 2009లో ఉమ్మడి తూర్పుగోదావరికి చెందిన విద్యాసంస్థల అధినేత చైతన్యరాజు ఎన్నికల్లో గెలిచి 2014 వరకు కొనసాగారు. 2015లో జరిగిన ఎన్నికల నుంచి పీడీఎఫ్ అభ్యర్థులు వరుసగా గెలుపొందుతూ వస్తున్నారు. ఉపాధ్యాయ సంఘాల్లో బలమైన యూనియన్‌గా ఉన్న యూటీఎఫ్ సహా కొన్ని సంఘాలు కలిసి పీడీఎఫ్‌గా ఏర్పడి ఉమ్మడి అభ్యర్థిని ఎంపిక చేస్తున్నాయి. 2015లో ఏలూరులోని సీఆర్ రెడ్డి కళాశాల ప్రిన్సిపల్ రాము సూర్యారావు పీడీఎఫ్ అభ్యర్థిగా భారీ మెజార్టీతో గెలుపొంది 2021 వరకు కొనసాగారు. 2022లో పీడీఎఫ్ అభ్యర్థి షేక్ సాబ్జీ (ఏలూరు) గెలుపొందారు. గతేడాది రోడ్డు ప్రమాదంలో ఆయన మరణించడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. మూడోసారి కూడా పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేసిన పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన బొర్రా గోపీమూర్తి విజయం సాధించారు.

యూటీఎఫ్‌లోనే గోపీమూర్తి

యలమంచిలి మండలం నార్నిమెరక గ్రామానికి చెందిన గోపీమూర్తి 1998లో ఎస్జీటీగా ప్రభుత్వ సర్వీసు ప్రారంభించారు. ప్రస్తుతం అత్తిలి మండలం కొమ్మర జెడ్పీ హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ యూటీఎఫ్‌లో క్రియాశీలకంగా కొనసాగుతున్నారు. 2009లో యూటీఎఫ్ మండల కార్యదర్శిగా, 2015లో జిల్లా ప్రధాన కార్యదర్శి, 2021లో రాష్ట్ర కోశాధికారిగా కొనసాగారు. 2016, 2017లో పశ్చిమగోదావరి జిల్లా జేఏసీ కో-చైర్మన్‌గా క్రియాశీలక పాత్ర పోషించారు.

ఉపాధ్యాయుల వాణి వినిపిస్తా..

ఓట్ల లెక్కింపు అనంతరం గోపీమూర్తి మీడియాతో మాట్లాడుతూ ఉపాధ్యాయుల వాణిని మండలిలో వినిపిస్తానని చెప్పారు. సీపీఎస్ రద్దు పోరాటానికి మద్దతుగా ఉద్యమంలో ముందుంటానని, ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్తానని అన్నారు. తనకు సహకరించిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్సీగా ఎన్నికైనట్టు ధ్రువీకరణ పత్రం అందుకున్న అనంతరం మద్దతుదార్లతో కలసి కాకినాడ యూటీఎఫ్ హోం వరకూ గోపీమూర్తి ర్యాలీగా వెళ్లారు.

ఓటు వేయడం రాని 814 మంది గురువులు

పెదపాడు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 5.2 శాతం మంది గురువులకు ఓటేయడం రాకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఎన్నికల్లో మొత్తం 15,494 ఓట్లు పోలవ్వగా సోమవారం కాకినాడలో నిర్వహించిన ఓట్ల లెక్కింపు సందర్భంగా 814 ఓట్లు చెల్లనివిగా గుర్తించారు. పట్టభద్రులు, విద్యాబుద్ధులు నేర్పే ఉపాధ్యాయులు, అధ్యాపకులకు ఓటు వేయడం రాలేదంటే ఆశ్చర్యం కలగక మానదు. ప్రస్తుతం ఈ విషయం చర్చనీయాంశంగా మారింది.

ఏలూరులో విజయోత్సవాలు



సభలో మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గోపీమూర్తి ఘన విజయం సాధించంతో ఏలూరులో ఉపాధ్యాయ సంఘాల నాయకులు విజయోత్సవాలు నిర్వహించారు. గెలుపునకు కృషి చేసిన యూటీఎఫ్, బీటీఏ, ఏపీటీఎఫ్ 1938, ఏటీఏ, కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ నాయకత్వానికి, ప్రజాసంఘాల నాయకత్వానికి అభినందనలు తెలిపారు. యూటీఎఫ్ జిల్లా కార్యాలయం నుంచి స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్ వరకు ర్యాలీ చేసి అనంతరం యూటీఎఫ్ కార్యాలయంలో విజయోత్సవ సభ నిర్వహించారు. ర్యాలీలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తఫా ఆలీ, రవికుమార్ రుద్రాక్షి, బీటీఏ రాష్ట్ర అధ్యక్షులు మనోజ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వెంకటేశ్వరరావు, ఏపీటీఎఫ్ 1938 ప్రధాన కార్యదర్శి జి.మోహన్ రావు, సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జేఏసీ హర్షం

ఏలూరు(మెట్రో) : గోపీమూర్తికి ఉమ్మడి జిల్లా జేఏసీ చైర్మన్ చోడగిరి శ్రీనివాస్, కన్వీనర్ రామారావు శుభాకాంక్షలు తెలిపారు. గోపీమూర్తి ఇదే స్ఫూర్తితో పీడీఎఫ్ ఎమ్మెల్సీలతో కలిసి ఉద్యోగవర్గానికి తన బాణీ, వాణిని శాసనమండలిలో వినిపించాలని కోరారు.

పశువధ శాలతో పర్యావరణానికి హాని



తణుకు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న స్థానికులు, హమాలీలు

తణుకు టౌన్: తణుకు మండలం తేతలి గ్రామంలో ఏర్పాటుచేసిన పశువధ శాలతో పర్యావరణానికి భంగం కలుగుతుందని, అనుమతులు రద్దు చేయాలంటూ స్థానికులు, గోసేవా సమితి సభ్యులు, ఎఫ్‌సీఐ గోడౌన్స్ హమాలీలు సోమవారం తణుకు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. తేతలి గ్రామ శివారు తణుకు 34వ వార్డు సరిహద్దుల్లో గోవధ శాలతో పర్యావరణం కలుషితమైన దుర్వాసన భరించలేకపోతున్నామంటూ గళమెత్తారు. తహసీల్దార్ కార్యాలయంలో జరిగే మీకోసం కార్యక్రమంలో ఫిర్యాదు అందించారు. గోవధ శాలకు అనుమతులు ఉన్నాయా అని గో సేవా కేంద్రం సభ్యుడు కొండ్రెడ్డి శ్రీనివాసు తహసీల్దార్ డీవీఎస్ఎస్ వర్మను ప్రశ్నించారు. అనుమతులు ఉన్నాయని ఫ్యాక్టరీ యాజమాన్యం చెబుతోందని, అయితే అనుమతులు లేవనే సమాచారం తమ వద్ద ఉందని శ్రీనివాసు అన్నారు. ఈనెల 7న ఫ్యాక్టరీకి వచ్చిన గేదెలను పట్టుకున్నామని, అవి పాడి గేదెలు అని, అలాగే పశువైద్యులు ఎవరూ లేకుండా కబేళాకు తరలించారని చెప్పారు. అలాగే గేదెల వ్యాన్‌ను తణుకు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించిన తర్వాత కూడా కేసు నమోదు చేసేందుకు పోలీసులు తాత్సారం చేశారని అన్నారు. తక్షణమే అధికారులు ఈ ఫ్యాక్టరీని ఇక్కడ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. గో సేవా సమితి సభ్యులు వెంకట సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరాజు, జల్లూరి జగదీష్, నాగరాజు, స్థానికులు, హమాలీలు పాల్గొన్నారు.

నేడు ఉమ్మడి జిల్లా వైఎస్సార్‌సీపీ నేతల సమావేశం

రీజనల్ కో–ఆర్డినేటర్ బొత్స హాజరు

తణుకు అర్బన్: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వైఎస్సార్‌సీపీ శ్రేణుల సమావేశం తణుకు పద్మశ్రీ ఫంక్షన్ హాలులో మంగళవారం నిర్వహించనున్నట్టు మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు జరిగే సమావేశానికి ముఖ్య అతిథిగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రీజనల్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ హాజరవుతారని చెప్పారు. పార్టీ పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల అధ్యక్షులు ముదునూరి ప్రసాదరాజు, దూలం నాగేశ్వరరావు, పార్లమెంట్ ఇన్‌చార్జులు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, జిల్లాలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొంటారని వివరించారు.

ప్రజా సమస్యలపై సమీక్ష

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సమస్యలపై పోరాటానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో సమావేశం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రీజనల్ కో–ఆర్డినేటర్‌గా ఎన్నికై మొదటిసారి తణుకు వస్తున్న బొత్స సత్యనారాయణకు పార్టీ కేడర్ ఘన స్వాగతం పలకనుంది. ఈనెలలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమాలతోపాటు రైతుల సమస్యలు, ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై బొత్స సమీక్షించనున్నారు. ఉమ్మడి జిల్లా పార్టీ కేడర్‌ను బలోపేతం చేయడంతోపాటు రాబోయే రోజుల్లో ప్రజాపక్షాన చేసే పోరాటాల్లో పార్టీ శ్రేణులు, వైఎస్సార్, జగన్ అభిమానులు పాల్గొనేలా కార్యాచరణ వంటి అంశాలపై దిశానిర్దేశం చేయనున్నారు.

అమానవీయ ఘటనపై దర్యాప్తు

ఏలూరు టౌన్: ఏలూరు అశోక్‌నగర్‌లోని సెయింట్ జోసఫ్ ఆధ్యాత్మిక శిక్షణ కేంద్రానికి సంబంధించిన బాలికల వసతి గృహంలో బాలిక గర్భం దాల్చటం .. ఆడబిడ్డకు జన్మనివ్వటం.. నవజాత శిశువును భవనం నుంచి బయటకు విసిరివేయటం సంచలనంగా మారింది. ఈ అమానవీయ సంఘటనపై ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ ప్రత్యేకంగా దర్యాప్తు చేస్తున్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారుల ఫిర్యాదుతో టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ వైవీ రమణ కేసు నమోదు చేశారు.

మట్టి తోలకాలపై చర్యలు

సాక్షి స్పందన

కొయ్యలగూడెం: అక్రమ మట్టి తోలకాలపై ఇరిగేషన్ శాఖ చర్యలు చేపట్టింది. 'సాక్షి'లో ఈనెల 8న ప్రచురించిన 'రాత్రివేళ మట్టి తవ్వకాలు' శీర్షికన కథనానికి పీడబ్ల్యూడీ డీఈ రవీంద్ర స్పందించారు. సోమవారం రాజవరం సమీపంలోని పులపాకుల చెరువును ఏఈ సీహెచ్ భాస్కర్‌తో కలిసి పరిశీలించారు. చెరువు గర్భంలో అక్రమంగా చేపట్టిన మట్టి తోలకాల ప్రదేశాలను పరిశీలించి స్థానిక రైతుల వద్ద నుంచి వివరాలు సేకరించారు. పూర్తి దర్యాప్తు చేపట్టి మట్టి తోలకాలు నిర్వహించిన వ్యక్తులపై కేసులు నమోదు చేయడంతో పాటు వాహనాల యజమానులపై కూడా చర్యలు తీసుకుంటామని రవీంద్ర చెప్పారు. సుమారు వందకుపైగా టిప్పర్ల ద్వారా ఇక్కడి నుంచి మట్టిని అక్రమంగా తరలించినట్టు రైతులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.



రాజవరం సమీపంలో మట్టి తోలిన చెరువును పరిశీలిస్తున్న అధికారులు

మీకోసం.. సమస్యలు అనేకం

అర్జీల వెల్లువ

- వ్యక్తిగత, ప్రజాసమస్యలపై ఫిర్యాదులు
- సోమవారం కలెక్టరేట్‌లో 157, జిల్లావ్యాప్తంగా 440 వినతులు
- పరిష్కారంలో తాత్సారం
- ఇప్పటివరకు మొత్తం అర్జీలు 4,818
- అపరిష్కృతంగా ఉన్నవి 733

మీకోసం కార్యక్రమాన్ని సమస్యలు ముంచెత్తుతున్నాయి.. వ్యక్తిగత, ప్రజా సమస్యలపై ప్రజల నుంచి అధిక సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్నాయి.. సోమవారం భీమవరం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమానికి 157 వరకు వినతులు రాగా జిల్లావ్యాప్తంగా వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో 440 వరకు వినతులు అందాయి. ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి సోమవారం స్పందన కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తూ వచ్చింది. ప్రజల నుంచి వచ్చిన వినతులను ఎప్పటికప్పుడు గడువులోపు పరిష్కరించడం ద్వారా విశ్వాసాన్ని పెంచింది. కూటమి ప్రభుత్వంలో స్పందన కార్యక్రమాన్ని మీకోసం–ప్రజా సమస్యల పరిష్కార వేదిక కింద పేరు మార్చారు. కూటమి పాలనలో జిల్లాలో ఇప్పటివరకు 4,818 అర్జీలు రాగా వాటిలో 733 వరకు వినతులు ఇంకా అపరిష్కృతంగానే ఉన్నాయి.

సాక్షి, భీమవరం/భీమవరం (ప్రకాశం చౌక్) : భీమవరం కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ సీహెచ్ నాగరాణి ఆధ్వర్యంలో మీకోసం కార్యక్రమం నిర్వహించగా జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చి అధికారుల వద్ద తమ గోడు వెళ్లబోసుకున్నారు. వ్యక్తిగత, ప్రజాసమస్యల పరిష్కారం కోరుతూ కలెక్టర్, ఆయా శాఖల అధికారులకు వినతులు అందజేశారు. పింఛన్లు, రేషన్‌కార్డుల మంజూరు, కుటుంబ తగాదాలు, ప్రభుత్వ భూములు ఆక్రమణలు, తాగునీరు, విద్యుత్ సమస్యలు, సరిహద్దు వివాదాలు, పీజీఆర్ ద్వారా భూ సర్వే చేయించాలని తదితర అంశాలపై ఫిర్యాదులు అందాయి. ఆక్రమణల చెర నుంచి ప్రభుత్వ పోరంబోకు భూమిని కాపాడాలని కోరుతూ పాలకొల్లు మండలం భగ్గేశ్వరానికి చెందిన కె.సూర్యకుమారి వినతిపత్రం అందజేయగా, పంట బోదెపై ఆక్రమణలు తొలగించి సాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చేయాలని ఆచంట మండలం భీమలాపురానికి చెందిన దేవి సత్యనారాయణ అర్జీ అందజేశారు. తనకు పుట్టింటి వారు ఇచ్చిన భూమి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ సందర్భంగా తప్పుగా నమోదైన ఆధార్, బ్యాంకు అకౌంట్ వివరాలను సరిచేయాలని ఆరవల్లికి చెందిన వరలక్ష్మి కోరారు.

సకాలంలో సమస్యలు పరిష్కరించాలి

కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన వినతులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఉదాసీనంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ప్రజా పరిష్కార వేదికలో అందే అర్జీల పరిష్కార ప్రగతిని ప్రతి వారం సమీక్షిస్తామన్నారు. అర్జీలు రీఓపెన్ అయితే కారణాలను వివరించాలని అధికారులకు సూచించారు.



భీమవరం కలెక్టరేట్‌లో దివ్యాంగుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగరాణి

ధరలు తగ్గించాలని..



కూటమి ప్రభుత్వం వచ్చాక నిత్యావసర సరకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. పేదవాడు కొనలేక తినలేక ఇబ్బంది పడుతున్నాడు. ప్రభుత్వం చర్యలు తీసుకుని నిత్యావసర ధరలు వెంటనే తగ్గించాలి. లేకపోతే కార్యాచరణ చేపట్టి నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తూ ఉండిలో జరిగిన మీకోసంలో వినతిపత్రం అందజేశాం.

– కోనాల భీమారావు, సీపీఐ జిల్లా కార్యదర్శి, ఉండి

ఫిర్యాదు చేసినా ఫలితం లేదు



పెనుగొండ పెద్ద వంతెన వద్ద నుంచి బాపూజీపురం వరకు రోడ్డు నిర్మాణం కోసం మీకోసంలో వినతిపత్రాలు అందజేశాం. కలెక్టర్, డిప్యూటీ సీఎం, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి, ఇతర శాఖల అధికారులకు వినతిపత్రాలు ఇచ్చాం. అయినా ఫలితం లేదు. ఈ రోడ్డు లేక ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అధికారులు స్పందించాలి.

– తాడి రాఘవరెడ్డి, పెనుగొండ

దివ్యాంగ పింఛన్ కోసం..



మా అబ్బాయి చిన్నతనం నుంచి దివ్యాంగుడైనా పింఛన్ రావడం లేదు. కూలీ పనులు చేసుకుంటూ కుమారుడిని సాకుతున్నా. గతంలో ఇల్లు ఉందని పింఛన్ రాదని చెప్పారు. మా అబ్బాయి వైకల్యాన్ని నిర్ధారిస్తూ సదరం సర్టిఫికెట్ కూడా ఉంది. పింఛన్ కోసం కలెక్టర్‌కు అర్జీ అందజేశాను.

–సీహెచ్ కుమారి, భీమవరం

ఓటు లేకుండా కుట్ర



నాకు నాలుగెకరాల భూమి ఉంది. నీటి సంఘం ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్నా. అయితే రెండు ఎకరాల భూమి ఆన్‌లైన్‌లో లేకుండా చేయడంతో ఓటు అర్హత కోల్పోయాను. నా పొలాన్ని కావాలనే వీఆర్వో ఆన్‌లైన్ చేయడం లేదు. నేను పోటీ చేయకుండా కుట్రలు చేస్తున్నారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశా.

– ఆదిరెడ్డి గంగధరరావు, నీటి సంఘం మాజీ అధ్యక్షుడు, వీరవాసరం

చెరువు కలుషితం పట్టదా?



వీరవాసరం మండలం బాలేపల్లిలో ఐదెకరాల మంచినీటి చెరువు కలుషితంపై పలుమార్లు అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదు. చెరువు సమీపంలోని రొయ్యల చెరువు వల్ల తాగునీటి చెరువు కలుషితం అవుతోంది. ఈ నీటిని తాగుతున్న గ్రామస్తులు రోగాల బారినపడుతున్నారు. దీనిపై భీమవరం కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశా.

– నంది సంపత్‌రావు, వార్డు మెంబర్, బాలేపల్లి, వీరవాసరం మండలం

క్లుప్తంగా

కోళ్ల వ్యర్థాల వాహనం సీజ్



కోళ్ల వ్యర్థాల వాహనాన్ని సీజ్ చేసిన పెదపాడు పోలీసులు

పెదపాడు: చేపల చెరువులకు చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని పెదపాడు పోలీసులు సీజ్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదపాడు మండలంలోని తోటగూడెంలో తనిఖీలు నిర్వహించగా వాహనంలో కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్, వాహన యజమాని, చెరువు యజమానిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటున్నట్లు పెదపాడు ఎస్సై కట్టా శారదా సతీష్ తెలిపారు. చికెన్ వ్యర్థాల రవాణా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వారి సమాచారాన్ని పెదపాడు ఎస్సై నంబరు 9440796637కు గాని, 112కు గాని ఫోన్ చేసి సమాచారం అందించాలని తెలిపారు.

చెస్‌లో విద్యార్థుల ప్రతిభ



మేడిచర్ల తన్మయి



పెన్మెత్స సాధిక్ వర్మ



దోలా నాగసాయి ఆశ్లేష్

జంగారెడ్డిగూడెం: చదరంగం రాష్ట్ర స్థాయిలో పోటీల్లో జంగారెడ్డిగూడెం చెస్ క్రీడాకారులు విజేతలుగా నిలిచారు. ఆదివారం గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్‌లో తమ అకాడమీకి చెందిన మేడిచర్ల తన్మయి అండర్–16 బాలికల విభాగంలో ప్రథమ స్థానం సాధించగా, అండర్–10 బాలుర విభాగంలో పెన్మెత్స సాధిక్ వర్మ 5వ స్థానం, అండర్ –14 బాలుర విభాగంలో పుసులేటి డోలా నాగసాయి ఆశ్లేష్ 9వ స్థానం సాధించినట్లు కోచ్ అయినపర్తి సరళా మాధవి తెలిపారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు



స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి వస్తువులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో జరిగిన చోరీ కేసులో ఇద్దరు ముద్దాయిలను అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ కోలా రజనీకుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం అక్టోబర్ 9న పట్టణంలో సూర్యతేజస్ నగర్‌లో ఉంటున్న కాపవరపు వరలక్ష్మీదేవి ఇంటి తాళాలు పగులగొట్టి సుమారు రూ. 2 లక్షలు విలువ చేసే బంగారు వస్తువులు, పక్క పోర్షన్‌లో పుల్లేటి కుర్తి లలితా శివజ్యోతి ఇంట్లో వెండి వస్తువులు చోరీ చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేయగా గుబ్బల శ్రీను, రావాడ శ్రీను ఈ చోరీకి పాల్పడినట్లు తెలిసిందన్నారు. వారి నుంచి రూ.లక్ష విలువ చేసే బంగారు, వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు.



● సామాజిక స్పృహ పెంచేలా..

తోలేరు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి నాటక పోటీలు సోమవారం వీరవాసరంలో ప్రారంభమయ్యాయి. సామాజిక స్పృహను పెంపొందించడానికి నాటక రంగం ఎంతో దోహదపడుతుందని వక్తలు పేర్కొన్నారు. మొదటి ప్రదర్శనగా స్వప్నం రాల్చిన అమృతం నాటిక, రెండో ప్రదర్శనగా కిడ్నాప్ నాటిక అలరించాయి. సినీ నటుడు శుభలేఖ సుధాకర్, నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణను సత్కరించారు. కళాపరిషత్ అధ్యక్షుడు చవ్వాకుల సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు. –వీరవాసరం



● కోలాటం.. కనువిందుగా..

తెలంగాణ రాష్ట్రానికి చెందిన కోలాట బృందం ద్వారకాతిరుమల క్షేత్రంలో సోమవారం ప్రదర్శించిన కోలాట నృత్యాలు అలరించాయి. ఖమ్మం జిల్లా వెనుబల్లి మండలం రామచంద్రరావు బంజర్‌కు చెందిన సీతారామ కోలాట బృంద మహిళలు దాదాపు 40 మంది సంప్రదాయ దుస్తులతో క్షేత్రానికి చేరుకున్నారు. పాదుకా మండపం వద్ద ఉన్న శ్రీవారి పాత కల్యాణ మండపంలో కోలాట గురువులు బి.సత్తిబాబు, జి.బాలు ఆధ్వర్యంలో కోలాట నృత్య ప్రదర్శనలు జరిపారు. ఇవి చూపరులను ఆకట్టుకున్నాయి. –ద్వారకాతిరుమల

వివాహితపై టీడీపీ కార్యకర్త
అత్యాచారయత్నం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల మండలంలోని మెట్ట పంగిడిగూడెం గ్రామంలో ఒక వివాహితపై సోమవారం టీడీపీ నేత అత్యాచారయత్నం చేశాడు. దీనిపై బాధితురాలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి కథనం ప్రకారం. మెట్టపంగిడిగూడేనికి చెందిన తోళం దుర్గా భవాని భర్తతో వేరుపడి, కొంత కాలంగా అత్తతో కలసి ఉంటోంది. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఉదయం ఏలూరు ప్రభుత్వాస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకుంది. తిరిగి మధ్యాహ్నం ఆర్టీసీ బస్సులో పంగిడిగూడేనికి చేరుకుని, అక్కడి నుంచి స్వగ్రామానికి నడుచుకుంటూ వెళుతోంది. ఈ క్రమంలో మెట్ట పంగిడిగూడేనికి చెందిన టీడీపీ కార్యకర్త అంజిబాబు మార్గమధ్యంలో కనిపించి గ్రామంలో దింపుతానని ఆమెను తన స్కూటీ ఎక్కించుకున్నాడు. కొంత దూరం వెళ్లిన తరువాత బండిని పుంతరోడ్డులోకి వేగంగా పోనిచ్చాడు. ఇటు ఎందుకు తీసుకెళుతున్నావని అరచి, గింజుకున్నా లెక్కచేయకుండా ఆమెను ఒక అరటి తోటలోకి లాక్కెళ్లి కొట్టి, అత్యాచారం చేయబోయాడు. ఆమె అతడి బారి నుంచి ఎలాగోలా తప్పించుకుని పరుగులు తీస్తుండగా, జరిగిన విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని అంజిబాబు ఆమెను బెదిరించాడు. ఈ క్రమంలో పక్కనే పొలాల్లోకి పరుగుపెట్టి వెళ్లిన బాధితురాలు జరిగిన విషయాన్ని అక్కడి రైతులకు తెలిపింది. అనంతరం వారి సహాయంతో గ్రామంలోకి చేరుకుంది. ఆ తరువాత రాత్రి 10 గంటల సమయంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి జరిగిన ఘటనపై ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ టి.సుధీర్ రాత్రి 10.30 గంటల సమయంలో ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించారు.

శ్రీవారి వాకిలి.. బంగారు లోగిలి

- స్వామి అంతరాలయం, ముఖ ద్వారాలు స్వర్ణమయం
- రూ.2.62 కోట్లతో ఎలక్ట్రో గోల్డ్ ప్లేటింగ్ పనులు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవారి అంతరాలయం స్వర్ణ శోభితమైంది. స్వామివారి భక్తులకు కనువిందు చేస్తోంది. స్వర్ణ కాంతులతో ధగధగలాడుతున్న వాకిలి నుంచి చిన వెంకన్నను దర్శించుకుంటున్న భక్తులు మంత్ర ముగ్ధులవుతున్నారు. దినదినాభివృద్ధి చెందుతున్న శ్రీవారి దివ్య క్షేత్రాన్ని నిత్యం వేలాది మంది భక్తులు దర్శిస్తున్నారు. శని, ఆదివారాలు, భక్తులు పోటెత్తుతున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా క్షేత్రంలో ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో దాతల సహకారంతో దేవస్థానం ఇప్పటికే స్వామివారి వాకిలిని దాదాపుగా స్వర్ణమయం చేశారు. అందులో భాగంగా జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ 2021 లో రూ.98,31,693 వ్యయంతో, 264 గ్రాముల 647 మిల్లీ గ్రాముల బంగారం, 147 కేజీల 641 గ్రాముల 700 మిల్లీ గ్రాముల రాగి రేకులతో ఆలయ ప్రధాన ముఖద్వారానికి, తలుపులకు, అంతరాలయ ద్వారానికి బంగారు తాపడం (ఎలక్ట్రో గోల్డ్ ప్లేటింగ్) చేయించారు. వీటిని అదే సంవత్సరం జనవరి 10న అప్పటి రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ప్రారంభించారు. కృష్ణా జిల్లా, బాపులపాడు మండలం, బొమ్ములూరుకు చెందిన దీపక్ నెక్స్‌జెన్ ఫీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ అడుసుమిల్లి వెంకట సుబ్రహ్మణ్యం, డైరెక్టర్లు రూ.1,64,19,411తో స్వామి అంతరాలయానికి బంగారు తాపడాన్ని చేయించారు. దీన్ని ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు ఈ ఏడాది అక్టోబర్ 4న ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావు, దాతలు, వారి కుటుంబ సభ్యులతో కలిసి ప్రారంభించారు.



స్వర్ణ కాంతులీనుతున్న శ్రీవారి అంతరాలయం, ముఖ ద్వారం



అంతరాలయం పైభాగాన చక్రం



అంతరాలయం గోడపై శ్రీవారి కల్యాణ ఘట్టం

త్వరలో స్తంభాలకు బంగారు పూత

అంతరాలయం ముందు పద్మావతి, ఆండాళ్ అమ్మవార్లు ఎదురుగా ఉన్న స్తంభాలకు ఇదే తరహాలో గోల్డ్ కోటెడ్ చేయించాలని నిర్ణయించినట్టు తెలిసింది. త్వరలో ఒక దాత సహాయంతో పనులు ప్రారంభించనున్నారని ఆలయ సిబ్బంది చెబుతున్నారు. ఇదిలా ఉంటే విమాన గోపుర స్వర్ణమయ పథకం ద్వారా భక్తుల నుంచి దేవస్థానం విరాళాలను సేకరిస్తోంది. విమాన గోపురాన్ని సైతం స్వర్ణమయం చేస్తే చినవెంకన్న ఆలయాన్ని చూడడానికి రెండు కనులు చాలవనే చెప్పొచ్చు.

దేదీప్యమానం శ్రీవారి దర్శనం



ఆలయ ముఖ ద్వారాలు, అంతరాలయం స్వర్ణ కాంతులీనుతున్నాయి. ఆ కాంతుల నడుమ దేదీప్యమానంగా వెలుగొందుతున్న శ్రీవారిని దర్శించుకోవడం ఎంతో ఆనందాన్ని కలిగించింది. గతంలో కంటే ఇప్పుడు ఆలయం అద్భుతంగా ఉంది.

గాదెల వీరాంజనేయులు, శ్రీవారి భక్తుడు, హైదరాబాద్

దాతల సహకారం మరపురానిది



స్వామివారి అంతరాలయాన్ని, ముఖ ద్వారాలను స్వర్ణమయం చేసిన దాతలకు అభినందనలు. వారు చేసిన పనికి కృతజ్ఞతలు తెలపాలి. హిందూ ఆలయాల అభివృద్ధికి ఇలాంటి దాతల కృషి ఎంతో అవసరం. చినవెంకన్న ఆలయంలో జరిగిన బంగారు పూత పనులు అద్భుతం.

వి.సతీష్, శ్రీవారి భక్తుడు, జంగారెడ్డిగూడెం

మావుళ్లమ్మను దర్శించుకున్న డీఐజీ



డీఐజీ వరప్రసాద్‌కు అమ్మవారి ఫొటో అందజేస్తున్న ఈవో నగేష్

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీమావుళ్లమ్మను సోమవారం గుంటూరు రేంజ్(జైలు శాఖ) డీఐజీ ఎం.వర ప్రసాద్ దర్శించుకున్నారు. ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ద మహాలక్ష్మీ నగేష్ అమ్మవారి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో టెలిఫోన్ బకాయిల పరిష్కారం

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని బీఎస్ఎన్ఎల్ టెలిఫోను బిల్లులు బకాయి పడ్డ వినియోగదారులు ఈ నెల 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ పి.రాజు ఒక ప్రకటనలో సూచించారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, తాడేపల్లిగూడెం, కొవ్వూరు, తణుకు, భీమవరం, నరసాపురం పరిధిలోని లోక్ ఆదాలత్ కోర్టుల్లో పరిష్కరించుకోవాలని కోరారు. మరిన్ని వివరాల 94947 08898, 94903 12777, 94404 33533 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ధాన్యం కొనుగోళ్ల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్

పెనుమంట్ర: మందకొడిగా ధాన్యం కొనుగోళ్లపై సాక్షిలో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు స్పందించారు. మండల వ్యవసాయ అధికారి ఎ.జ్యోత్స్నల, తహసీల్దార్ వై.రవికుమార్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. మండలంలో వారం రోజులుగా 4380 ఎకరాలలో కోతలు జరిగగా, 9198 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అయిందని తెలిపారు. రైతు సేవా కేంద్రాల ద్వారా 7,098 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని చెప్పారు. సాక్షిలో ప్రచురితమైన వార్తపై వెలగలవారిపాలెంలో రైతులను విచారించామన్నారు. ధాన్యం తేమ శాతం 16.8గా గుర్తించి 1,100 సంచులను రైతులకు అందజేశారని, ధాన్యం రోడ్డుపైకి చేర్చడానికి కాలువగట్టు సరిగ్గా లేనందున దారిని బాగు చేసుకుని మిల్లులకు పంపడానికి సిద్ధంగా ఉన్నట్లు రైతులు తెలిపారని చెప్పారు.

రెవెన్యూ భూమి కబ్జాకు యత్నం

- గూడెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ముందు షెడ్డు నిర్మాణానికి యత్నం
- అడ్డుకున్న అధికారులు

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం పట్టణంలోని తాలుకా ఆఫీసు ప్రాంగణంలో గజం స్థలం రూ.2 లక్షల నుంచి రూ. 3 లక్షల వరకూ ఉండడంతో అందరి కళ్లు ఆ స్థలంపైనే.. చిన్న పాకలు వేయడం, ఆలయాలు నిర్మించి ఆదాయం పెంచుకోవడం, తాత్కాలిక విద్యుత్ మీటర్లు ఏర్పాటుచేసి అద్దెలు వసూలు చేయడం ఇంతవరకు జరుగుతున్న తంతు. ఈ ప్రాంగణంలో ట్రాఫిక్ పోలీసు స్టేషన్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, ఉప ఖజానా అధికారి కార్యాలయాలు ఉన్నాయి. ఇటీవలి ఈ స్థలంలో పాకలు వేస్తూ ఆక్రమణలకు పాల్పడుతున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ముందు ఉన్న పాకలు కాస్తా, నెమ్మదిగా వెనక్కి పాకుతూ నల్లజర్ల బోర్డర్‌కు వచ్చేశాయి. ఇక్కడి పాకలను రెవెన్యూ అధికారుల ఆదేశాలతో తొలగించారు. అయితే ఆదివారం మళ్లీ షెడ్లు వేసేందుకు ప్రయత్నించారు. అయితే విషయం బయటకు రాగా.. అధికారులు షెడ్డు వేసే పనులు అడ్డుకున్నారు. మెటీరియల్ సీజ్ చేశారు.

ఈ స్థలం ఎవరిది?

స్వాతంత్ర్యానికి పూర్వం సుమారు 8.43 ఎకరాల భూమిని తాలూకా కాంపౌండ్ పేరుతో కార్యాలయాల కోసం కేటాయించారు. కాలక్రమంలో సబ్ జైలు మూత పడింది. తహసీల్దార్ కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, కోర్టు భవనాలు మరమ్మతులు చేసి వాడుకుంటున్నారు.



తాడేపల్లిగూడెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద షెడ్డు నిర్మాణం కోసం దింపిన మెటీరియల్

రూరల్ పోలీసు స్టేషన్ ఉన్న ప్రాంతంలో పట్టణ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఏర్పాటు చేశారు. తాలూకా కాంపౌండ్‌గా ఉన్న ప్రాంతంలోనే జిల్లా పరిషత్ హైస్కూలు నిర్మించారు. దాని పక్కగా రైతు బజారుకు షెడ్డు వేశారు. పక్కన పట్టణ పోలీసు స్టేషన్ నిర్మించుకున్నారు. వెనుక మండలపరిషత్ కార్యాలయం, ఎంఈఓ కార్యాలయం, గృహనిర్మాణ శాఖ కార్యాలయం, మండల మహిళా సమాఖ్య, పెన్షనర్ల భవనం, కొత్త తహసీల్దార్ కార్యాలయాలు నిర్మించారు. తాజాగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట పాకల స్థానంలో షెడ్డు నిర్మించడానికి ప్రయత్నించడం వివాదాస్పదంగా మారింది. రెవెన్యూ రికార్డుల ప్రకారం ఇది తాలూకా కాంపౌండ్.. గ్రామ కంఠంగా లేదు కనుక ఎవరికీ కేటాయించే వీలులేదు. ఈ స్థలంలో ఎలాంటి భవనాలు నిర్మించేందుకు స్థలాన్ని కోరే హక్కులేదు.

ఎలాంటి నిర్మాణాలూ చేయకూడదు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట సుమారు ఉన్న 30 సెంట్లకు పైగా స్థలం రెవెన్యూకు చెందింది. ఇక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టనివ్వం. స్థలాన్ని పరిరక్షిస్తాం.

–సునీల్ కుమార్, తహసీల్దార్

పంచారామ క్షేత్రం హుండీ లెక్కింపు



పంచారామ క్షేత్రం హుండీల ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం పంచారామక్షేత్రం దేవస్థానం హుండీలు, కార్తీక మాస దర్శనాల ద్వారా రూ.1,13,08,439 వచ్చినట్లు ఆలయ ఈవో డి.కృష్ణంరాజు తెలిపారు. 53 రోజులకు హుండీలు తెరచి లెక్కించగా రూ.26,42,447, అన్నదానం హుండీ ద్వారా రూ.2,05,975, కార్తీక మాసం 30 రోజులకు సేవల ద్వారా రూ.1,80,244, దర్శనాల ద్వారా రూ.47,50,400, కానుకల ద్వారా రూ.23,327, అన్నదానం విరాళాలు రూ.29,61,411, ప్రసాదం అమ్మకాలు రూ.5,44,635 ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు.

బోధనలో కొత్త విధానాలు అనుసరించాలి



నిట్‌లో అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్ సోమయాజులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): జాతీయ విద్యా విధానం –2020లోని సరికొత్త ఫీచర్స్‌తో విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దవచ్చని మణిపూర్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ డీవీ ఎల్ఎన్ సోమయాజులు సూచించారు. ఏపీ నిట్ ఆధ్వర్యంలో జాతీయ విద్యా విధానంలో కృత్రిమ మేధ అంశంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఇన్‌చార్జి డైరెక్టర్ ఎన్వీ రమణారావు అధ్యక్షత వహించారు. సోమయాజులు మాట్లాడుతూ ఆలిండియా కౌన్సిల్ రూపొందించిన ఫ్లికర్స్ యాప్, ఈడీ ఫజిల్, క్విజీస్, గామా యాప్‌లు బోధనలో అమలు చేయడం వల్ల మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. కృత్రిమ మేధ అన్ని రంగాల్లో ప్రధాన పాత్ర పోషిస్తుందని చెప్పారు. వరంగల్ నిట్ ఈసీఈ విభాగం ఆచార్యులు ఎన్‌వీఎస్ఎన్ శర్మ మాట్లాడుతూ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ సమయంలో విద్యార్థులను ప్రశ్నించడంతో పాటు సరైన చిత్రాల సాయంతో పాఠాలు చెప్పడం ద్వారా ఎక్కువ కాలం గుర్తుండే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

చిన్నారుల భవితను మింగేస్తున్న స్మార్ట్‌ఫోన్లు

- గంటల కొద్దీ సెల్‌ఫోన్‌తోనే..
- పిల్లల మెదడుపై తీవ్ర ప్రభావం
- అప్రమత్తంగా ఉండాలంటున్న నిపుణులు



పాలకొల్లు సెంట్రల్: ఈ మధ్య ప్రతి ఇంట్లో చిన్నారులు సెల్‌ఫోన్లకు అతుక్కుపోతున్నారు. ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసలవుతున్నారు. తల్లిదండ్రులు నిరంతరం ఫోన్ చూడడం చూసి పిల్లలు దానినే అలవాటు చేసుకుంటున్నారు. ఇది ప్రమాదకర పరిణామమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పిల్లలు మారాం చేస్తే సెల్‌ఫోన్‌లు ఇచ్చి వాళ్లను బుజ్జగిస్తున్నారు. అది కాస్తా అలవాటుగా, వ్యసనంగా మారిపోతోంది. చిన్నారులను ఆకర్షించేలా ఆన్‌లైన్ గేమ్స్ రూపొందించడం వల్ల ఆ గేమ్స్ నుంచి బయటకు రాలేక గంటల తరబడి ఫోన్‌లో ఆడుతూనే ఉంటున్నారు. దీనివల్ల మానసిక సమస్యలే కాకుండా, దృష్టి లోపాలు, చదువులో వెనకపడడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. శారీరక శ్రమకు దూరంగా ఉండడం వల్ల వివిధ రకాల అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి.

తల్లిదండ్రులదే బాధ్యత

మొదట్లో సరదాగా అనిపించే ఆన్‌లైన్ గేమ్స్ చివరకు అడిక్షన్‌కు దారితీస్తున్నాయి. ఇలా అతిగా ఆడితే ముప్పు తప్పదని వైద్య పరిశోధనలు చెబుతున్నాయి. డ్రగ్స్ వాడినప్పుడు విడుదలయ్యే డోపమైన్ రసాయనం.. ఈ ఆన్‌లైన్ గేమ్స్ అతిగా ఆడేవారిలోనూ విడుదలై గంటల తరబడి ఆ గేమ్ ఆడేలా ప్రభావితం చేస్తుందని పరిశోధనలు చెబుతున్నాయి. అందువల్ల మొదట్లోనే పిల్లలు సెల్‌ఫోన్‌కు అడిక్ట్ కాకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైనే ఉంది. వారి దృష్టి ఇతర వ్యాపకాల వైపు మళ్లేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. మొబైల్, కంప్యూటర్ స్క్రీన్స్‌ను అతిగా చూస్తే కంటి రెటీనా దెబ్బతిని చిన్నతనంలోనే చూపు మందగించే ప్రమాదం ఉంటుంది. మొబైల్, కంప్యూటర్లలో అదే పనిగా గేమ్స్ ఆడుతున్నవారు చదువులోనూ వెనుకబడిపోతున్నారని వైద్యులు చెబుతున్నారు.

అతిగా చూడడంతో మెదడులో మార్పులు

పిల్లలు సెల్‌ఫోన్ ఎక్కువగా వాడుతున్నారని గమనిస్తే వెంటనే మనం వారికి ఫోన్ అందుబాటులో లేకుండా చూడాలి. అలాగే ఆరుబయట ఆడుకునే ఆటల వైపు ప్రోత్సహించాలి. డ్యాన్స్, సంగీతం, పెయింటింగ్ వంటి వాటిపై ఆసక్తి పెంచేలా చూడాలి. ఇటీవల 5వ తరగతి చదువుతున్న ఓ చిన్నారి ఎప్పుడూ సెల్‌ఫోన్‌తోనే గడిపేది. ఫోన్ తీసుకుంటే గోల చేస్తుందని తల్లి కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించింది. కొద్ది రోజులకు ఆ చిన్నారి మాటలు తేడాగా ఉండడంతో.. తల్లిదండ్రులు భీమవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. సెల్‌ఫోన్ ఎక్కువగా చూడడం వల్ల బ్రెయిన్‌లో కొద్దిపాటి మార్పులు వచ్చాయని, ఆరు నెలల పాటు మందులు వాడాలని సూచించారు.

మితంగా వాడేలా చూడాలి



ఏదైనా మితంగా ఉంటేనే ఆరోగ్యదాయకం. మితిమీరితే మానసిక సమస్యలు తలెత్తుతాయి. సెలవుల్లో పిల్లల్ని సెల్‌ఫోన్ వద్దని వారిస్తే అదే కావాలంటారు. అందుకోసం తల్లిదండ్రులు పిల్లలను బయటకు తీసుకువెళ్లాలి. ఆరుబయట ఆటలు ఆడుకునేలా ప్రోత్సహించాలి. పరిచయం ఉన్న వాళ్లలో ఉన్నత స్థానంలో ఉన్న వారి వద్దకు తీసుకువెళ్లి వారు సాధించిన విజయాలు వివరించాలి. ధనశేఖర్, సైకాలజిస్ట్

శ్లోకాలు చదివిస్తున్నాం



సెల్‌ఫోన్‌ను పిల్లలకు ఎంత దూరంగా ఉంచుతున్నా కనురెప్పపాటులో తీసేస్తున్నారు. కాసేపే అని వదిలేస్తుంటే అలవాటు పడిపోతున్నారు. గేమ్స్‌తో పాటు యూట్యూబ్ కూడా ఆన్‌చేస్తున్నారు. దానివల్ల భయం వేస్తుంది. ఫోన్ నుంచి డైవర్ట్ చేయడానికి పిల్లలకు భగవద్గీత శ్లోకాలు చదివిస్తున్నాను.

బంగారు సూర్యకిరణ్, పాలకొల్లు

ఫోన్ వాడకం తగ్గిస్తున్నాం



మొదట్లో ఫోన్‌లో ఏవేవో నొక్కుతుంటే అబ్బో పిల్లలకు ఫోన్ ఆన్‌చేయడం వచ్చేసిందని ఆనందించేవాళ్లం. నేడు అది ప్రమాదంగా తయారైంది. గేమ్‌లు వాళ్లే డౌన్‌లోడు చేసుకుంటున్నారు. పిల్లలు ఇంట్లో ఉన్నంతసేపు ఫోన్ వాడకం తగ్గించుకుంటున్నాం.

గోటేటి గంగరాజు, పాలకొల్లు

డేంజర్.. యమ డేంజర్

- ప్రమాదకరంగా తేతలి వైజంక్షన్
- చిమ్మచీకట్లో జంక్షన్
- రాళ్లులేచిన రోడ్డుతో నిత్యం ప్రమాదాలే
- అదుపుతప్పుతున్న వాహనాలు


తేతలి వైజంక్షన్‌లోని జాతీయ రహదారిపై చీకటిగా ఉన్న దృశ్యం

తణుకు అర్బన్: రోడ్డు ప్రమాదాలకు నిలయంగా ఉండే తేతలి వైజంక్షన్ జాతీయ రహదారి ప్రాంతంలో అత్యంత ప్రమాదకర పరిస్థితులు నేడు కనిపిస్తున్నాయి. ఫ్లై ఓవర్ పనులు గత కొంతకాలంగా నిలిపివేయడంతో ఈ ప్రాంతం ప్రయాణికుల రాకపోకలకు ఆటంకాలను కలుగచేస్తుందనే ఆరోపణలు ఇటీవల బలంగా వినిపిస్తున్నాయి. ఫ్లైఓవర్ పనుల్లో భాగంగా భారీ స్తంభాలు ఏర్పాటు చేసేందుకు ఈ ప్రాంతంలో తవ్వకాలు నిర్వహించారు. అయితే ఆ స్తంభాలు పూర్తిస్థాయిలో వేయకుండా నిలిచిపోవడం తవ్విన ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో పూడ్చకపోవడం వంటి సమస్యలతో ఆ ప్రాంతం ప్రమాదాలకు నిలయంగా మారింది. అంతేకాకుండా జంక్షన్‌లో ఫ్లై ఓవర్ పనుల్లో భాగంగా వీధిదీపాలు తొలగించడంతో చీకటిపడితే చాలు ప్రయాణికులకు ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించని దుస్థితి నెలకొందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాహనాలు, స్థానిక దుకాణాల వెలుగుల మధ్య వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. దీంతో ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు.

రహదారి ఛిద్రం..

తణుకు పైడిపర్రు నుంచి తేతలివైపు వెళ్లే మార్గం పూర్తిగా ఛిద్రమైపోవడంతో తరచూ వాహనదారులు ప్రమాదాల పాలవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. గోతులు, రాళ్లను తప్పించేలోపే వాహనాలు అదుపుతప్పి పడిపోతున్నాయని వాహనదారుగుల గగ్గోలు పెడుతున్నారు. ముఖ్యంగా ఈ జంక్షన్ మీదుగా జాతీయ రహదారిలో భారీ వాహనాలు 24 గంటలు వెళ్తాయి. తాడేపల్లిగూడెం నుంచి పెరవలి వైపు, పెరవలి వైపు నుంచి తాడేపల్లిగూడెం వైపు నిత్యం లక్షల సంఖ్యలో వాహనాలు ప్రయాణాలు చేస్తుంటాయి. అంతేకాకుండా తేతలి వైపు నుంచి తణుకులోకి తణుకు నుంచి తేతలి వైపు వెళ్లే వాహనాలు ఛిద్రమైన రహదారి మీదుగా వేల సంఖ్యలో వాహనాలు ప్రయాణాలు చేస్తుంటాయి. ఇంతటి ప్రాధాన్యత ఉన్న జంక్షన్‌లో వాహనాలు కనిపించేలా వీధిదీపాలు ఏర్పాటు చేయాలని, ఛిద్రమైన రోడ్డును తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని, ప్రమాదకర మలుపుల్లో రేడియం స్టిక్కర్లు అంటించాలని ప్రయాణికులు కోరుతున్నారు.


తేతలి వైజంక్షన్‌లో ఛిద్రమైన రహదారి


తేతలి వైజంక్షన్ నుంచి జాతీయ రహదారిపైకి వెళ్లే ప్రమాదకరమైన ప్రాంతం

చిమ్మచీకట్లో వైజంక్షన్..



తేతలి వైజంక్షన్ ప్రాంతం చాలా ప్రమాదకరంగా మారింది. చీకటి పడితే చాలు వాహనాలు కనిపించని దుస్థితి అక్కడ నెలకొంది. కేవలం వాహనాల వెలుగులోనే ఈ ప్రాంతంలో ప్రయాణాలు చేయాల్సి వస్తుంది. పాదచారులు, సైకిళ్లపై ప్రయాణాలు చేసే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి వెలుగు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి.

– షేక్ జిలాని, తణుకు

వాహనాలు పడిపోతున్నాయి..



తేతలి వైజంక్షన్ మీదుగా తేతలి, తాడేపల్లిగూడెం వైపు ప్రయాణాలు చేయాలంటే వాహనదారులు భయపడుతున్నారు. ఆ రోడ్డు ఛిద్రమైపోయి ద్విచక్ర వాహనదారులు రాళ్లలో ప్రయాణిస్తూ వాహనం అదుపుతప్పి ప్రమాదాలపాలవుతున్నారు. రాళ్లు లేచిన రోడ్డులో తాత్కాలిక మరమ్మతులు చేసి ప్రమాదాల జరగకుండా చూడాలి.

– యారబాటి రామకృష్ణ, తణుకు

14న అలంపురంలో ఉచిత మెగా వైద్యశిబిరం

పెంటపాడు: మండలంలోని ఈనెల 14న అలంపురం టీబీఆర్ డిఫెన్ అకాడమీ, జూనియర్ కళాశాలల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు టీబీఆర్ సంస్థల అధినేత టి.భోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు ఆశ్రం ఆస్పత్రికి చెందిన జనరల్‌మెడిసన్, చర్మ వ్యాధులు, ఎముకలు, కీళ్లు, గైనకాలజీ, ఈఎన్‌టీ వైద్యులతో పాటు, ప్రత్యేకంగా బ్లడ్ గ్రూపు పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. ఈ శిబిరాన్ని పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కోరిమిల్లిలో బైబిలు శిక్షణ తరగతులు ప్రారంభం

పెంటపాడు: మండలంలోని కోరిమిల్లి గ్రామంలో ఎల్‌జేసీ చర్చిలో బైబిలు శిక్షణ తరగతులు ప్రారంభమైనట్లు సంఘ కాపరి మల్లిపూడి ఒనేసిం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నంకు చెందిన డేనియల్ జిత్రో నేతృత్వంలో జరిగే ఈ తరగతులు ఈనెల 12 వరకు జరుగుతాయన్నారు.

11న రాచర్లలో క్రిస్మస్ వేడుకలు

పెంటపాడు: మండలంలోని రాచర్ల హెల్పింగ్ హేండ్స్ ఆధ్వర్యంలో ఈనెల 11న సాయంత్రం 6వ వార్షిక ఐక్యక్రిస్మస్ వేడుకలు నిర్వహించనున్నట్లు హెల్పింగ్ హేండ్స్ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. తణుకు చెందిన సేవకులు జాషువా జూడ్ క్రిస్మస్ సందేశం అందిస్తారన్నారు. ఎస్సీపేట కమ్యూనిటీ హాలు గ్రౌండ్‌లో జరిగే ఈ వేడుక సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

క్లుప్తంగా

మీ కోసంకు నాలుగు వినతులు


మీ కోసంలో వినతులు స్వీకరిస్తున్న మునిసిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మునిసిపల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు నాలుగు వినతులు వచ్చాయి. ఇంజనీరింగ్‌కు 1, పబ్లిక్ హెల్త్‌కు 1, టౌన్‌ప్లానింగ్‌కు 2 వినతులు అందాయి. సత్యవతి నగర్ రోడ్డు నెంబర్10లో నీటి సరఫరా పైపులైన్ వేసేందుకు, అపార్ట్‌మెంట్ మురుగు నీరు, ప్రైవేట్ స్థలంలో నిలుపుదల చేయడం గురించి, టిడ్కో కింద చెల్లించిన లక్ష రూపాయిలు రిఫండ్ చేయడం గురించి, టిడ్కో ఇంటికి లక్ష రూపాయలు చెల్లించినందుకు ప్లాట్ అలాట్మెంట్ చేయడం గురించి వినతులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ అసిస్టెంట్ కమిషనర్ ఎం.రవి సుధాకర్, ఎంఈ వై.వి. వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలి


ఉచితంగా మందులు అందజేస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యార్థులు క్యాన్సర్, చర్మవ్యాధులు, హెయిర్ సమస్యలపై అవగాహన పెంచుకోవాలని డాక్టర్ వాత్సల్య మైథిలి పేర్కొన్నారు. లయన్స్‌క్లబ్ డైమండ్స్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో వాత్సల్య స్కిల్, హెయిర్ క్లీనిక్ వారిచే అవగాహన, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ జిల్లా కోఆర్డినేటర్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఉచితంగా మందులను అందజేశారు. వైద్యులకు సత్కారాలు చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు కొప్పిశెట్టి రమణయ్య, డాక్టర్ కేవీ కమల, చిక్కాల అంబికా, డాక్టర్ భాను సత్యనారాయణ, లియో సుస్మిత, పీకే ప్రసాద్, గోపి చందు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా షష్ఠి ఉత్సవాలు


వడ్డీ రఘురామ్ నాయుడు దంపతులకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న దృశ్యం

అత్తిలి: మండలంలోని షష్ఠి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అత్తిలి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వడ్డీ రఘురామ్ నాయుడు సోమవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ కమిటీ తరపున స్వామివారి చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ మాజీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పశువధ శాల వద్దంటూ 99 ఫిర్యాదులు


పశువధ శాలను తొలగించాలని ఫిర్యాదులు అందజేస్తున్న స్థానికులు

తణుకు టౌన్: తణుకు మండలం తేతలి గ్రామంలో ఏర్పాటుచేసిన పశువధ శాలతో పర్యావరణానికి భంగం కలుగుతుందని, అనుమతులు రద్దు చేయాలంటూ స్థానికులు తహసీల్దార్ కార్యాలయానికి ఫిర్యాదుదారులు పోటెత్తారు. తేతలి గ్రామ శివారు తణుకు 34వ వార్డు సరిహద్దుల్లో గోవధ శాలతో పర్యావరణం కలుషితమైన దుర్వాసన భరించలేకపోతున్నామంటూ స్థానికులు 99 మంది ఫిర్యాదు చేసినట్లు తహసీల్దార్ డీవీఎస్ఎస్ వర్మ తెలిపారు.

గోపిమూర్తి విజయంపై హర్షం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బొర్రా గోపిమూర్తి విజయం సాధించడంపై జిల్లా ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ శుభాకాంక్షలు తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు జుత్తిగ నరసింహమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల హరేరామ్, జిల్లా చింతకాయల బాబూరావు, అభినందనలు చెప్పారు.

రేపు అత్తిలిలో ఉమర్ ఆలీషా ఆధ్యాత్మిక సభ

అత్తిలి: సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి మహోత్సవాలలో భాగంగా ఈనెల 11వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు శ్రీవిశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం నవమి పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా సద్గురువర్యులు ఆధ్యాత్మిక ఉపన్యాసమిస్తారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా క్రిస్మస్ పండుగ ర్యాలీ


ర్యాలీని ప్రారంభిస్తున్న యుపీఎఫ్ సంఘ నాయకులు

పెంటపాడు: క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకొని క్రైస్తవసంఘాలు, నాయకులు ఐక్యంగా ఉండాలని, కోరుతూ యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ (యుపీఎఫ్)ఆధ్వర్యంలో క్రిస్మస్ పండుగ ర్యాలీ గూడెంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు, పాస్టర్ల సంఘ నాయకులు మల్లిపూడి జైబాబు ఈ ర్యాలీని ప్రార్థనలు చేసి ప్రారంభించారు. భాగ్యలక్ష్మీపేట ఎల్ఎల్ఎం చర్చి నుంచి గూడెం హౌసింగ్ బోర్డు వరకు తిరిగి ఎల్ఎల్ఎం చర్చివరకు ఈ ర్యాలీ జరిగింది. క్రైస్తవ సంఘ నాయకులు, పలు డినామినేషన్ చర్చిలు, విశ్వాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు మల్లిపూడి జైబాబు మాట్లాడుతూ గత ఆరేళ్లుగా యుపీఎఫ్ ద్వారా 150 మంది పాస్టర్లు పలు డినామినేషన్ చర్చిల ద్వారా ఆధ్యాత్మిక సేవతో పాటు, సోషల్ సర్వీస్ చేస్తూ సమాజాభివృద్ధి కోసం పాటు పడుతున్నారన్నారు. సంఘ గౌరవ అధ్యక్షుడు బిషప్ డేవిడ్ మాట్లాడుతూ ఈ క్రిస్మస్ వేడుకలలో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రతి సంఘ కాపరి ప్రత్యేక ప్రార్థనలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో 4 మండలాల నుంచి పాల్గొన్న సేవకులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐజక్, అబ్రహాం, రాజ్‌కుమార్,, సిహెచ్ మనష్షే, శిరపరపు శాంతిరాజు, రత్నరాజు, యెహెజ్కేలు, రాజబాబు, జాన్‌బాబు, మల్లిపూడి సుజిత్ ఖన్నా, డేవిడ్‌లివింగ్ స్టన్, గూడెం ఎల్ఎల్ఎం హెల్పింగ్ టీం సభ్యులతో పాటు, గూడెం, పెంటపాడు, రూరల్, నిడమర్రు, గణపవరం, ఉంగుటూరు మండలాలకు చెందిన పలువురు సంఘ పాస్టర్లు, విశ్వాసులు పాల్గొన్నారు.

ఘనంగా అమర వీరుల స్మారక దినోత్సవం


తణుకు టౌన్: సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు


పెంటపాడు: సైనిక సంక్షేమనిధికి విరాళాలు సేకరించిన ఎన్‌సీసీ విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వరరావు

తణుకు టౌన్: అమర వీరుల స్మారక దినోత్సవం సందర్భంగా తణుకులోని ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాల ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో సోమవారం ఫ్లాగ్ డే కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో పట్టణంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈర్యాలీలో పట్టణంలోని వివిధ దుకాణ దారులు, వ్యాపార సంస్థల నుంచి ఫ్లాగ్ డే చందాలను వసూలు చేసినట్లు ప్రిన్సిపల్ యూ లక్ష్మీసుందరి బాయి తెలిపారు. ఈకార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు సీహెచ్ రమేష్ బాబు, కేవీ శ్యామలాదేవి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ఎన్‌సీసీ క్యాడెట్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైనిక కుటుంబాలకు అండగా

పెంటపాడు: దేశం కోసం పోరాడే వీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం పెంటపాడులో సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన సమావేశంలో ఫ్లాగ్‌డే ఆవశ్యకతను ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ ప్రేమ్‌సాగర్‌లు మాట్లాడుతూ దేశ రక్షణ కోసం సైనికుల త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. వారి కుటుంబ సంక్షేమం కోసం సేకరించిన విరాళాలు సద్వినియోగం కావాలన్నారు. ఈ సందర్భంగా కళాశాల, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థుల తరపున సేకరించిన రూ.13,494లను సైనిక సంక్షేమనిధికి అందజేయనున్నట్లు తెలిపారు. విరాళాలు సేకరించిన సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. కళాశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అత్యధిక కేసులు పరిష్కరించాలి


తణుకు కోర్టులో పోలీసు అధికారులతో మాట్లాడుతున్న న్యాయమూర్తులు కె.రత్నప్రసాద్, డి.సత్యవతి

తణుకు అర్బన్ : ఈనెల 14వ తేదీన తణుకు కోర్టులో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కరించేందుకు పోలీసులు అధికారులు కృషి చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, ఏలూరు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నప్రసాద్ అన్నారు. తణుకు కోర్టులో సోమవారం మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి అధ్యక్షతన పోలీసు అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజీకాదగ్గ ప్రతి కేసులోను ఇరువర్గాల మధ్య సయోధ్య కుదిర్చి పరిష్కరించాలని సూచించారు. అనంతరం తణుకు సబ్‌జైలును సందర్శించిన ఆయన ముద్దాయిలకు ఆహారం అందుతున్న తీరుతోపాటు వసతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేని ముద్దాయిలకు న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేసుకునే సౌకర్యం ఉందని అన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పాతర్లంక సాయిరామ్, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఏవీ నాగరాజు, బెంచ్‌కోర్టు మేజిస్ట్రేట్ తాడి ఆంజనేయులు, జైలు సూపరింటెండెంట్ జి. మోహనరావు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మాలలను విమర్శించడం సరికాదు


మాట్లాడుతున్న మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మాలలను సైకోలుగాను అభివర్ణిస్తూ మాలలను కించపరిచే విధంగా మందకృష్ణ వ్యాఖ్యలు చేయడాన్ని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, మాల సంఘాల జేఏసీ గౌరవాధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు ఖండించారు. హౌసింగ్‌బోర్డుకాలనీలో సోమవారం మంగరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మందకృష్ణ మతోన్మాదులు పంచనచేరి, అంబేడ్కర్ వారసులైన మాలలను విమర్శించడం సరికాదని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యవహారం చంద్రబాబు, మోదీ కుట్రలుగా అభివర్ణించారు. ఈ నెల 15వ తేదీన గుంటూరు సమీపంలో నల్లపాడులో జరిగే మాలల సింహగర్జన మహాసభలో అధిక సంఖ్యలో పాల్గొనేందుకు మాలలు సత్తా చాటడానికి గ్రామ గ్రామన మాలలను సమాయత్తం చేస్తున్నామన్నారు. జేఏసీ నాయకులు మహానంది, వెంకటేష్, నల్లన్న, మల్లన్న, నాగేశ్వర్, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి



పెంచిన ధరలు తగ్గించాలని ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పెంచిన నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక బ్రహ్మానందరెడ్డి మార్కెట్ వద్ద ధర్నా కార్యక్రమం జరిగింది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పప్పులు, వంటనూనె, ఉల్లిపాయలు, వెల్లులిపాయలు, ఎండుమిర్చి, కూరగాయలు తదితర ధరలు ఆకాశాన్ని అంటాయని, ధరలు అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైనట్లు చెప్పారు. అధికారంలోకి రాకముందు ధరలు పెరిగిపోయాయి అంటూ గగ్గోలు పెట్టిన కూటమి పార్టీలు ఇప్పుడు నోరు మెదపడం లేదని అవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత మార్కెట్‌లో ధరలు చూసి జనం బెదిరిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కృత్రిమ కొరత సృష్టించి వ్యాపారులు దోపిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధరలు అదుపు చేసి జనాలపై పెనుభారాలు తగ్గించాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టి కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గొన్నాబత్తుల నాగేశ్వరరావు, అయినాల సత్యనారాయణ, ఎస్.నారాయణరావు, ఎస్.రమణ, రామోహ్మన్‌రావు, ఆర్.శ్రీను, గోవిందు, తాతారావు, నాగేశ్వరరావు, అప్పలనాయుడు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న బి.హరికుమార్

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు చెల్లించాల్సిన డీఆర్, పీఆర్‌సీ బకాయిలు వెంటనే చెల్లించాలని విశ్రాంతో ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు బి.హరికుమార్ కోరారు. పట్టణంలోని కార్యాలయంలో సోమవారం అసోసియేషన్ సమావేశం జరిగింది. కొత్తగా పీఆర్‌సీ బకాయిలు వచ్చేలోగా 30 శాతం ఇంటిరీయమ్ రిలీఫ్ చెల్లించాలని, కోంటమ్ ఆప్ పునరుద్ధరణ చేయించాలని, నగదు రహిత ఆరోగ్యం ప్రభుత్వం ఇహెచ్ఎస్ కార్డ్స్‌పై పూర్తిగా అందజేయాలని, మెడికల్ రీయంబర్స్‌మెంట్ బిల్లులు వెంటనే చెల్లించాలని, మెడికల్ బిల్లు పరిధిని రూ. 2 లక్షల పరిధి నుంచి 5 లక్షల వరకు పెంచాలని, కమ్యూటేషన్ ఆఫ్ పెన్షన్ రికవరీ విధానంపై అతి త్వరలో ఏపీ ప్రభుత్వం ఒక నిర్దిష్టమైన ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ తీర్మానాలు చేశారు. డిసెంబరు 17వతేదీన ఆల్ ఇండియా పెన్షనర్స్ డే మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దాసం నాగేశ్వరరావు, కె.బాలకృష్ణ, సత్యనారాయణమూర్తి, గరికపాటి సబ్రహ్మణ్య శర్మ, ముస్తాఫా, వీరారావు, అర్జునరావు, కృష్ణాకుమారి, జయరాజు, భాషా పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో రుత్విక్ ప్రతిభ


రుత్విక్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెదతాడేపల్లిలో గల ప్రైవేటు విద్యాసంస్థకు చెందిన ఐదో తరగతి విద్యార్థి సత్తి రుత్విక్ వెంకట కార్తికేయరెడ్డి ఫిడే ఆన్‌లైన్ ఎరీనాలో అంతర్జాతీయ టైటిల్ ఎరీనా క్యాండిడేట్ మాస్టర్ (ఏసీఎం) సాధించాడు. పాఠశాల ప్రిన్సిపాల్ ఈ విషయాన్ని సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థిని అభినందించారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి


వార్డులోర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని ప్రజల భాగస్వామ్యంతో దోమలను అరికట్టవచ్చునని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు పేర్కొన్నారు. బేబి సెంటర్ పరిధిలో అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక 15, 16 వార్డులలో వెక్టార్ కంట్రోల్ హైజీన్, వారంలో ఒకరోజు డ్రై డే పాటించాలని కోరుతూ క్షేత్రస్థాయిలో పరిశీలనలు, ర్యాలీలు జరిగాయి. లక్ష్మణరావు మాట్లాడుతూ దోమల ద్వారా వచ్చే వ్యాధులను తప్పక అరికట్టాలన్నారు. ప్రజలలో చైతన్యం రావాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. పరిసరాలు, నివాస స్థలాలలోను, వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో అవసరమని చెప్పారు. జ్వరలక్షణాలు ఉన్నట్లు అయితే ఆరోగ్య కార్యకర్తలను, ఆశాలను సంప్రదించాలని, ప్రాథమిక నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. అన్ని అర్బన్ హెల్త్ సెంటర్‌లలోను, ఏరియా ఆసుపత్రిలోను వైద్య పరీక్షలు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. ఆరోగ్య కార్యకర్త నిర్మల, అన్నపూర్ణ, అంబిక, చంద్ర, ఆశా కర్యకర్తలు, శానిటేషన్ కార్యదర్శి సందీప్, ఆరోగ్య సహాయకులు కాంతారావు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హోటళ్లలో మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు


మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసిన ఎక్సైజ్ అధికారులు

ఇరగవరం: తణుకు నియోజకవర్గంలోని పలు చోట్ల ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారు. దాబాల్లో, హోటళ్లలో మద్యం విక్రయిస్తు కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ మణికంఠరెడ్డి తెలిపారు. ఇరగవరం మండలం కంతేరు గ్రామంలో మద్యం విక్రయిస్తున్న అనే వ్యక్తిని అరెస్టు చేసి, 5 మద్యం సీసాలను స్వాధీనం చేసుకునామని తెలిపారు. దాబా హోటల్స్‌లో మద్యం విక్రయాలు, సేవించడం నిషేదమని, కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఎస్ఐ ఆర్.మధుబాబు, హెడ్ కానిస్టేబుల్ కె.శ్రీనివాస్, ఎన్.అప్పలస్వామి, కానిస్టేబుల్ జి.గంగాధర్‌లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


వైద్యులతో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి రాజ్‌కుమార్

అత్తిలి: సీజనల్ వ్యాధులపై ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ గులాబ్ రాజ్‌కుమార్ తెలిపారు. సోమవారం అత్తిలి మండలం మంచిలి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో ఆరవల్లి, ఉనికిలి, స్కిన్నెరపురం గ్రామాలలో జరిపిన ఫీవర్ సర్వే డేటాను ఆయన పరిశీలించి వైద్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఫీవర్ సర్వేలో గుర్తించిన జ్వరం కేసులను హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌కుగాని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ గులాబ్ రాజ్‌కుమార్ వైద్యులను ఆదేశించారు. ల్యాబ్ టెక్నీషియన్ వద్ద , పీహెచ్‌సీ వద్ద ఉన్న ఫీవర్స్ డేటాను పరిశీలించారు. ఫీవర్ కేసులు నమోదు సాధారణ స్థాయిలో ఉన్నట్లు గుర్తించారు. గ్రామాలలో జ్వరబాధితులను ఆసుపత్రులకు పంపాలని, పారిశుద్ధ్య సమస్యలను గుర్తించిన వెంటనే పంచాయతీ అధికారులకు తెలపాల్సిన బాధ్యత ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలపై ఉందన్నారు. వైద్యులు ఎల్ చాముండేశ్వరి, డాక్టర్ పి కిరణ్, సబ్ యూనిట్ ఆఫీసర్ జి వెంకటేశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్ టీవీ వరప్రసాద్, జి మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా


సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. సోమవారం పలు సమస్యలతో వచ్చిన ప్రజలతో మమేకమై వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. త్వరతిగతిన ఆయా సమస్యలను పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అడపా ప్రసాద్, పైబోయిన వెంకట్రామయ్య, పాలూరి వెంకటేశ్వరరావు, చాపల రమేష్, బి.ముఖేష్ పాల్గొన్నారు.